క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించండి



ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరు జెడ్పీ హెచ్ఎస్‌లో బుధవారం జరిగిన పాఠశాలల సముదాయ సమావేశంలో మండల ఎంఈవో-2 రామతులసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన విద్యావిధానంలో సాంకేతిక అంశాలు బోధన సమయంలో జోడించాలని, అప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించవచ్చని తెలిపారు. అనంతరం ఆమె పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

బొల్లాపల్లి: మండలంలోని సీతారామపురం తండాలో పేకాట స్థావరంపై బుధవారం బండ్లమోటు స్టేషన్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, రూ.29190లు స్వాధీనం చేసుకున్నారు. సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి నిర్వహించామని, ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, రూ.29190ల నగదు స్వాధీన పరచుకుని, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచినట్లు ఈ మేరకు బండ్లమోటు స్టేషన్ ఎస్సై జి.రవికృష్ణ తెలిపారు.

సోషల్ ఉపాధ్యాయులకు సమావేశం

శావల్యాపురం: ఉపాధ్యాయుల్లో బోధన నైపుణ్యాలను పెంపొందించడానికి కాంప్లెక్స్ సమావేశాలు దోహదపడతాయని శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కాంప్లెక్స్ చైర్మన్ బోడ్డపాటి విజయలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో నియోజకవర్గ స్థాయిలో సోషల్ సబ్జెక్టుపై ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపుదలతో పాటు ఉపాధ్యాయులు బోధన తీరు పరీక్ష పత్రాలు నమూనా, పాఠ్యపుస్తకాలు మార్పులపై విశ్లేషణ చేయటం ద్వారా ఉపాధ్యాయులు మరింత సులువుగా విద్యార్థులకు బోధిస్తారన్నారు. తద్వారా విద్యార్థుల్లో సామర్థ్యాలు మెరుగుపడతాయన్నారు.

949 మందికి సాగు ధ్రువీకరణ పత్రాలు

శావల్యాపురం: అర్హత కల్గిన కౌలు రైతులందరూ పంట సాగు ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు తెలిపారు. బుధవారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఏవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 1640 పంట సాగు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకొనగా ఇప్పటి వరకు 949 మంది కౌలు రైతులకు పంట సాగు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశామన్నారు. సెంటు భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలు రైతులు ఈనెల 30లోగా పంట సాగు ధ్రువీకరణ పొందటం ద్వారా వీరందరికీ రైతు భరోసా పథకం వర్తించుతుందన్నారు. పంట సాగు ధ్రువీకరణ పత్రాలు కల్గి రైతులకు రైతు భరోసా కేంద్రాల్లో రాయితీపై విత్తనాలు, బ్యాంకుల ద్వారా రూ.లక్ష రూపాయల వరకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. మండలంలో పీఎం కిసాన్ పథకంలో 937 మంది రైతులు వివరాలు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ఖరీఫ్ సీజను ప్రారంభమైన నేపథ్యంలో రైతుభరోసా కేంద్రాల్లో ఎరువులు కొరత లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు.ఏఈవో పురేటి అశోక, వీఏఏలు వెంకయమ్మ ఉన్నారు.

చెదురుమదురు వర్షాలు

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో చెదురుముదురుగా వర్షాలు కురుస్తున్నాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో బుధవారం ఉదయానికి 5.4ఎం.ఎం వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఆకాశం మేఘావృతమై చెదురుమదురుగా వర్షాలు పడుతుండటంతో చిత్తడి వాతావరణం నెలకొంది. వ్యవసాయ పనులు నిలిచిపోయాయి.

పీఎంశ్రీ పథకానికి శావల్యాపురం హైస్కూల్

శావల్యాపురం: పీఎంశ్రీ పథకానికి శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోడ్డపాటి విజయలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్న త పాఠశాల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిందని త్వర లో నిధులు మంజూరు అవుతాయన్నారు. ఈనిధులతో పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు సైన్సు ల్యాబ్, తదితరవన్నీ కల్పిస్తామన్నారు. ఇందులో భాగంగా జన్ భాగి దారి కార్యక్రమం విద్యార్థులచే యోగసనాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉపా ధ్యాయులు గురుబాబు, బెజవాడ నాగేశ్వరరావు, సీఆర్‌పీ రావూరి శివప్రసాదు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంతో అన్ని వర్గాల్లో సంతోషం

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేస్తున్న మంత్రి విడదల రజిని

నాదెండ్ల: రాష్ట్ర అభివృద్ధి, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సువర్ణపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని అన్ని వర్గాల ప్రజలు తమ కుటుంబ సభ్యుడిగా ఆదరిస్తున్నారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. జంగాలపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం మొదటి రోజు నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా గ్రామస్తులు ఆమె వెంట నడిచారు. కృష్ణాలయంలో ప్రత్యేక పూజలు అనంతరం బీసీ కాలనీ నుంచి కార్యక్రమం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు అమలౌతున్న తీరును ప్రజలతో ముచ్చటిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల ముగింట్లోకి తెచ్చారన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా అన్ని పథకాలను ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలకు అందిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో, ఇతర ప్రభుత్వ పదవుల్లో పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించారన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, అమ్మఒడి, ఆరోగ్యశ్రీ, విద్యాదీవెన, విద్యావసతి, వైఎస్సార్ ఆసరా, చేయూత, వాహన మిత్ర, లానేస్తం వంటి ఎన్నో సంక్షేమ పథకాల అమలుతో అన్ని వర్గాల్లో సంతోషాలు అందించారన్నారు. విద్య, వైద్య రంగాల్లో రాష్ట్రంలోనే స్వర్ణ యుగం ఆవిష్కృతమైందన్నారు. ఇప్పటికే పలు రాష్ట్ర ప్రభుత్వాలు మన రాష్ట్రంలో అమలౌతున్న సంక్షేమ పథకాలను గమనిస్తూ, వారి రాష్ట్రాల్లో అమలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల సీతారామిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు తిరుమలరెడ్డి లూర్దురెడ్డి, జరుగుమల్లి ఏసురత్నం, నాయకులు మద్దూరి కోటిరెడ్డి, స్లీవారెడ్డి, చేరెడ్డి వెంకటరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మూసా ఇస్లాం, జగనన్న సురక్ష మండల కన్వీనర్ అల్లడి రవికుమార్, ఎంపీటీసీ సీతా మహాలక్ష్మి, నాదెండ్ల, గణపవరం సొసైటీ చైర్మన్ కురుకుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, సింగారెడ్డి కోటిరెడ్డి, జెట్టి నాగమణి, శివ లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

తాగునీటి చెరువులకు సాగర్ జలాలు

నాదెండ్ల: తాగునీటి అవసరాల కోసం సాగర్ జలాలు విడుదల కావటంతో మండలంలోని రక్షిత మంచినీటి చెరువులు నింపేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మండల పరిధిలోని తుర్లపాడు మేజర్, పెదనందిపాడు మేజర్, చిరుమామిళ్ళ మేజర్ ద్వారా చెరువులకు నీరు చేరుతున్నాయి. తుర్లపాడు మేజర్ ద్వారా గణపవరం, నాదెండ్ల, అప్పాపురం, ఎండుగుంపాలెం, పెదనందిపాడు మేజర్ ద్వారా సంకురాత్రిపాడు, గొరిజవోలు, చిరుమామిళ్ళ మేజర్ ద్వారా మరికొన్ని గ్రామాలకు సాగర్ జలాలు చేరుతున్నాయి. బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ సూర్యతేజ, కాలువల ద్వారా నీటి ప్రవాహాన్ని పర్యవేక్షించారు. ఎండుగుంపాలెం వద్ద సాగర్ జలాలను అధికారులు ఉదయం 6 గంటల సమయంలో 106 క్యూసెక్కులు రాగా, రాత్రి 150 క్యూసెక్కులు పెరగవచ్చని అంచనా వేశారు. మరో వారం రోజుల్లో మండలంలోని అన్ని చెరువులు నింపుకోవాలని పంచాయతీ అధికారులు, సర్పంచ్‌లను కోరారు.

పేదల సంక్షేమానికి సురక్ష



వంకాయలపాడులో సురక్ష శిబిరం ద్వారా సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం



గ్రామసభలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ జయరామిరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ మస్తాన్‌రావు

- మంచి ప్రభుత్వానికి మద్దతు నివ్వాలి
- సురక్ష శిబిరంలో ప్రజాప్రతినిధులు

యడ్లపాడు: పరిపాలనను ప్రజలకు చేరువ చేస్తూ అర్హులకు సంక్షేమ లబ్ధి అందజేయడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ వడ్డేపల్లి నరసింహరాజు చెప్పారు. మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది. చివరిగా వంకాయలపాడు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష సదస్సు బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో సులువుగా వివిధ రకాల ధ్రువ పత్రాలు అందుతుండడంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వానికి అందరూ అండగా నిలిచి మద్దతు నివ్వాలని కోరారు. ఎంపీడీవో వై.హనుమారెడ్డి, ఈవోపీఆర్డీ బి.వరూధిని, ఆర్ఐ ఎం.చక్రవర్తి, వైఎస్ ఎంపీపీ షేక్ నాజులా, మండల సచివాలయ కన్వీనర్ రాచమంటి చింతారావు ప్రసంగించారు. అధికారులు ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను స్వీకరించారు. వలంటీర్ల గ్రామసర్వేలో దరఖాస్తు చేసుకున్న 1400 మందికి పౌరసేవలకు సంబంధించిన వివిధ సర్టిఫికెట్లను అతిథులచే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బింజు బొల్లయ్య, పంచాయతీ కార్యదర్శి కె.సాంబశివరావు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వీఆర్వో కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ ఖాదర్‌బాష, బి.సాంబశివరావు, పల్లపు రవి, అంకమ్మరావు, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చందవరంలో...

నాదెండ్ల: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ దరిచేరాలన్న సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. చందవరం సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సుమారు 1700 గృహాలకు గాను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గడిచిన కొద్దిరోజుల క్రితం 1200 గృహాలకు పైగా సందర్శించి సర్వే చేశారు. వారికి అవసరమైన 480 ధ్రువపత్రాలను ఉచితంగా సభలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జరిగిన సాధారణ ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మిగిలిపోయిన లబ్ధిదారులు ఎవరైనా ఉన్నట్లయితే వారికి కూడా సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా ధ్రువ పత్రాలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఏది అవసరమో, అవసరాన్ని గుర్తించి వారికి మేలు చేయాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం నెలరోజుల పాటు ఈ కార్యక్రమం ద్వారా 17 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా సచివాలయాల ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, సర్పంచ్ మస్తాన్‌వలి, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, జగనన్న సురక్ష మండల కన్వీనర్ అల్లడి రవికుమార్, ఎంపీటీసీ ప్రభావతి, డీటీ అనురాధ, ఆర్ఐ రమీజా, పార్టీ నాయకులు చేరెడ్డి అంకిరెడ్డి, మద్దూరి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ పరిధిలో...

వినుకొండ(నూజెండ్ల): జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల మండలంలోని కంభంపాడు, మూర్తిజాపురం గ్రామాల్లో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుబాబు, ఎంపీడీవో వీరభద్రాచారి, డీటీ అర్జున్‌నాయక్, జడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి యాదవ్, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, గ్రామసచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి మంచి కార్యక్రమం చేపట్టారు. పాఠశాలల్లో చేరే విద్యార్థులకు ఆదాయ, కుల ఇతరేత్ర సర్టిఫికెట్ల కోసం ఆఫీసుల చుట్టూ తిరగకుండా వెంటనే ఇచ్చేస్తున్నారు. జగనన్న ప్రభుత్వంలో పౌరసేవలు వేగంగా అందించడం అభినందనీయం. మూడు రోజుల్లోపే కుల ధ్రువీకరణ పత్రం అందించారు. ఇంత వేగంగా ప్రభుత్వ సేవలు ఇంటి వద్దకే అందించడమనేది ఊహించలేదు, ఎప్పుడూ చూడలేదు. ఇంతకన్నా ఆనందం ఇంకేముంటుంది. ఇలాంటి ప్రభుత్వాలు మళ్లీ మళ్లీ రావాలి.

–షేక్ కరీష్మా, బోయపాలెం

సేవలు వేగంగా, సులభంగా..



గతంలో కుల, ఆదాయ సర్టిఫికెట్లు పొందాలంటే వారం, పది రోజుల పాటు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగేవాళ్లం. మీ సేవ, నెట్ సెంటర్లలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలంటే ఒక్కొక్క దానికి రూ.300 చొప్పున ఖర్చు అయ్యేది. అయితే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పైసా ఖర్చు లేకుండా కుల, ఆదాయ, నివాస ఇతరేత్ర సర్టిఫికెట్లు ఉచితంగా అధికారులు అందజేశారు. వలంటీర్ల వ్యవస్థ వచ్చినప్పటి నుంచి సమస్యలు చకచకా పరిష్కారమవుతున్నాయి.

–షేక్ జరీనా, వంకాయలపాడు

చాలా మంచి కార్యక్రమం



సచివాలయ వ్యవస్థ ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతుంది. గతంలో కుల, ఆదాయ ధ్రువ పత్రాలకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. సమాజంలో అంతో కొంతో పలుకుబడి ఉన్న వారికి త్వరగా పనులు జరిగేవి. సామాన్య ప్రజలు మాత్రం పనులు మానుకొని రోజుల తరబడి తిరిగినా పనులు జరిగేవి కాదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ముఖ్యంగా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సమయ నిబంధన విధించి అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా చేసేలా చర్యలు చేపట్టింది. దీంతో ఏ సమస్య అయినా ఇట్టే పరిష్కారం అవుతుంది.

–షేక్ చినజాను, బోయపాలెం

ఘనంగా పీర్ల ఊరేగింపు



రొంపిచర్ల గ్రామంలో నిర్వహించిన పీర్ల ఊరేగింపు

రొంపిచర్ల: మండలంలోని పలు గ్రామాల్లో ముస్లిం సోదరులు మొహరం పండగను పురస్కరించుకొని బుధవారం పీర్ల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండలంలోని రొంపిచర్ల, విప్పర్ల, సంతగుడిపాడు, మునమాక, ఎడ్వర్డ్ పేట, కొత్తపల్లి, అన్నవరం తదితర గ్రామాలలో గల పీర్ల చావిడీల నుంచి పీర్లను గ్రామాల్లో కనక తప్పెట్లతో, సన్నాయి మేళాలతో ఊరేగించారు. మొహరం పండుగలో భాగంగా 7వ సరగత్ సందర్భంగా ఆయా గ్రామాల్లో గల పీర్ల చావిడీలలో గల పీర్లకు ప్రార్థనలు నిర్వహించి గ్రామాలలో ఊరేగించారు. పీర్లు ఎత్తుకొని యువకులు చేసిన నృత్యాలు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

ప్రశాంతంగా జరుపుకోండి

యడ్లపాడు: మొహర్రం పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ పి.సురేష్ సూచించారు. మండలంలోని కొండవీడు గ్రామంలో సిబ్బందితో పర్యటించిన ఆయన స్థానికంగా ఉన్న పీర్ల చావిడిని గ్రామపెద్దలతో కలిసి సందర్శించారు. మొహర్రం పండుగ పదోరోజున జరిగే భారీ ఉత్సవాలకు బందోబస్తు నిర్వహణపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. అనంతరం సచివాలయం వద్దకు గ్రామపెద్దల్ని పిలిపించి మాట్లాడారు. మొహర్రం పండుగ సందర్భంగా జరిగే ఉత్సవాల్లో స్థానికులు, సమీప గ్రామాల ప్రజలు ఎవరైనా చిన్ని చిన్న తగాదాలతో క్షణికావేశానికిలోనై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. అందుకు పెద్దలంతా సమన్వంతో పోలీసులకు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షేక్ మొహమ్మద్ యూనీస్, ఎంపీపీ-2 బాపనపల్లి శ్రీనివాసరావు, యండ్రపల్లి వెంకట్రావు, షేక్ జాకీర్, ముజావర్ బాజీ, దేగల వెంకటేశ్వర్లు, ముజావర్ శిలార్, ముజావర్ సలాం, మాజీ ఎంపీటీసీ కట్టా ప్రసాద్ ఉన్నారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడి మృతి

వంకాయలపాడు జెడ్పీ హెచ్ఎంగా బాధ్యతలు చేపట్టిన నెలరోజులకే...



పి.శ్రీనివాసరావు (ఫైల్)

యడ్లపాడు: మండలంలోని వంకాయలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెనుమాక శ్రీనివాసరావు (55) బుధవారం 11.30 గంటలకు గుండెపోటుతో మృతి చెందారు. గుంటూరు జిల్లా తాడికొండ గ్రామానికి చెందిన ఆయన నాలుగు నెలల క్రితం గుంటూరులోని చుట్టుగుంట సెంటర్‌లోని ఓ అపార్టుమెంట్‌ను కొనుగోలు చేసి కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే ఉంటున్నారు. 1995లో స్కూల్ అసిస్టెంట్‌గా బోధనారంగంలోకి అడుగిడారు. నూతక్కి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంగా పదోన్నతి పొందారు. తర్వాత మంగళగిరిలో ఎంఈవోగానూ విధులు నిర్వహించారు. అచ్చంపేట మండల వేల్పూరు జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎంగా పనిచేస్తూ తాజాగా జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా నెలరోజుల కిందట యడ్లపాడు మండలం వంకాయలపాడు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌కు వచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం పాఠశాలకు వచ్చేందుకు సిద్ధం అవుతూ బాత్‌రూంలోకి వెళ్లి ఎంతకూ బయటకు రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తలుపుకొట్టినా సమాధానం లేకపోవడంతో డోర్‌ను పగులగొట్టి చూడగా నిర్జీవంగా పడి ఉన్నాడు. వెంటనే వైద్యుడిని చూపించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయనకు భార్య సుజాత, కుమారుడు మనోజ్, కుమార్తె హిమజలు ఉన్నారు. పిల్లలు ఇద్దరు ఉన్నత విద్యను అభ్యసించి ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేస్తున్నారు. శ్రీనివాసరావు మృతి విషయం తెలుసుకున్న మండలంలోని సహోపాధ్యాయులు గుంటూరులోని ఆయన నివాసానికి చేరుకుని భౌతికకాయానికి నివాళి అర్పించారు. గురువారం ఉదయం గుంటూరులోనే అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బోధనా నైపుణ్యాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి

ఈపూరు: ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న బోధనా నైపుణ్యాలతో విద్యార్థులకు చక్కగా బోధిస్తే చదువులో ఉన్నత స్థానాలు పొందుతారని ఈపూరు జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు జెడ్పీ హైస్కూల్లో స్కూల్ కాంప్లెక్ సమావేశం బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మొదటగా పాఠశాల సముదాయం సంయుక్త కార్యదర్శిగా ఊడిజర్ల హెచ్‌సీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులును ఎన్నుకున్నారు. సమావేశంలో శిక్షకులు వారికి నూతన మెలకువలు నేర్పించారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు బోధనా నైపుణ్యాలు పెంచుకుని తద్వారా విద్యార్థులకు ఎలా చెబితే అర్థమవుతుందో తెలుసుకొని చక్కగా చెబితే వారి లక్ష్యాలు పూర్తిగా నెరవేర్చిన వారవుతారన్నారు. వారి జ్ఞాపకశక్తి పెంపొందించేలా, వారి పరీక్ష సమయాల్లో మనం ఏ విధంగా నేర్పిస్తే మంచిగా రాస్తారో అర్థం చేసుకోవాలన్నారు. పలు బోధనా అంశాలపై విశదీకరించారు.

ఈకేవైసీ నమోదు అయితేనే పీఎం కిసాన్ జమ

ఈపూరు: పీఎం కిసాన్ నగదు రావాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రామారావు అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 8,297మంది పీఎం కిసాన్‌కు అర్హులు కాగా వారిలో 1366మంది ఈకేవైసీ చేయించుకోలేదని, ఈ నెలాఖరు లోపు రైతు భరోసా కేంద్రంలో వారు ఈకేవైసీ పూర్తి చేసుకుంటే వారికి 14వ ఇనిస్టాల్మెంట్ కింద రూ. 2వేలు జమ అవుతాయన్నారు. వీరిలో కొంతమంది చనిపోయిన వారు ఉన్నారని, చనిపోయిన వారి డెత్ సర్టిఫికెట్‌ను ఆర్‌బీకేల్లో సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తులు చేస్తే ఆ రూ.2 వేలు వారి కుటుంబసభ్యులకు వస్తాయన్నారు. అలాగే కౌలు రైతు కార్డులు కూడా కౌలుకు పొలం వేసుకునేవారు పొందవచ్చని, వీరికి రైతు భరోసా వర్తిస్తుందని, వీరు కూడా ఈనెలాఖరు లోపు కౌలు రైతు కార్డులు పొందితే రైతు భరోసా, గ్రూపు ఇన్సూరెన్స్, క్రాప్ బుకింగ్, విత్తనాలు, రుణాలు వంటివి పొందవచ్చన్నారు. మండలంలో 2060 కౌలు రైతుకార్డులు టార్గెట్ ఉండగా ఇప్పటివరకు 871కౌలు రైతు కార్డులు అందించామన్నారు. అలాగే ప్రస్తుతం మండలానికి 16 క్వింటాళ్ల కందులు కేటాయించారని, ఒక్కొక్క రైతు భరోసా కేంద్రానికి 130 బ్యాగ్‌లు అందించామని, అవసరమైన వారు తీసుకోవచ్చన్నారు.

అలాగే 438 హెక్టార్లలో కంది పండించాల్సి ఉండగా 700 హెక్టార్లలో కంది పండించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని రామారావు పేర్కొన్నారు. ప్రతి రైతు ఆర్‌బీకేల్లో అందించే సేవలను వినియోగించుకోవాలని, ఏమైనా సమస్యలు ఉంటే రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించవచ్చన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు

డీఎస్పీ మహేష్

ఈపూరు: నేరాల నియంత్రణకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు నరసరావుపేట డీఎస్పీ కె.వి.మహేష్ అన్నారు. బుధవారం రాత్రి స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మండలంలో ఇటీవల వెలుగులోకి వచ్చిన నకిలీ మిరప విత్తనాల కేసుకు సంబంధించి విచారణ జరుగుతుందన్నారు. మండలంలో రాత్రి పూట గస్తీ పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండల కూడలి మార్గంలో అవసరమైన ఏరియాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మేజరు గ్రామాల్లో వ్యాపార వాణిజ్య సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా నిర్వాహకులకు సూచించారు. అనంతరం పోలీసు సిబ్బందితో మాట్లాడి రికార్డులు పరిశీలించారు. ఆయనతో పాటు వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్, ఎస్సై షేక్ మహమ్మద్ ఫిరోజ్ ఉన్నారు.

రీసర్వే పనులు వేగవంతం చేయాలి

శావల్యాపురం: రీసర్వే పనులు రైతుల సమక్షంలో పారదర్శంగా త్వరితగతిన పూర్తిచేయాలని నరసరావుపేట డివిజన్ రెవెన్యూ అధికారి మర్రిడ్డి శేషిరెడ్డి అన్నారు.బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రీసర్వే పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీవో శేషిరెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 140 రెవెన్యూ గ్రామాలు ఉండగా 70 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తికాగా 45 గ్రామాల్లో భూహక్కు పత్రాలు అందజేశామన్నారు. 45 గ్రామాల్లో రికార్డు పనులు జరుగుతున్నాయని,15 గ్రామాల్లో భూములపై గ్రౌండ్ టూతింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. సెప్టెంబరు నాటికి పూర్తిస్థాయిలో రీసర్వే పనులు పూర్తి అయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. శావల్యాపురం మండలంలో పిచికలపాలెం, వేల్పూరు, శానంపూడి రెవెన్యూ గ్రామాల్లో రికార్డు పనులు జరుగుతున్నాయన్నారు. ఈక్రమంలో రీసర్వే పనులు పురోగతి పెరిగేలా రెవెన్యూ అధికారులకు దిశ నిర్దేశం చేశామన్నారు. ఆయనతో పాటు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, డిప్యూటీ తహసీల్దార్లు వేముల వెంకట నాగరాజు, పి. నాసరయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

గుణాత్మక విద్య అందించడం అందరి బాధ్యత

యడ్లపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించే బాధ్యత గురువులదేనని యడ్లపాడు ఎంఈవో-1 నాగరత్నం చెప్పారు. సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు మండలంలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు రెండోరోజైన బుధవారం పాఠశాల సముదాయ సమావేశం జరిగింది. ఈ నేపథ్యంలో మండలంలోని జగ్గాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించి సమావేశం నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా నాగరత్నం మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో నిరంతరం మార్పులు జరుపుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దీనికి తగినట్లుగానే ఉపాధ్యాయులు కూడా తమ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు గుణాత్మక విద్యతో పాటు నైతిక విలువలతో కూడిన బోధనలు అందించాలన్నారు. ఈ సమావేశం ద్వారా ఉపాధ్యాయులు కొత్త కొత్త అంశాలను తెలుసుకుని మార్పుకు అనుగుణంగా బోధనలను సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గాపురం జెడ్పీహైస్కూల్ హెచ్ఎం ఉషశ్రీ, డీఆప్‌సి సరిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

చిలకలూరిపేటటౌన్: రోటరీ క్లబ్ పండరీపురం ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు ఎం.లింగయ్యచౌదరి చెప్పారు. బుధవారం క్లబ్, సాదినేని చౌదరయ్య స్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో గుప్పెడు బియ్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఓ ప్రైవేటు స్కూల్‌కు రెండు క్వింటాళ్ల బియ్యం, పది లీటర్ల సన్‌ఫ్లవర్ ఆయిల్, ఐదు కేజీల గోధుమ పిండి, నిత్యావసర సరకులు అందజేశారు. దాతలు అందించిన సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించాలని కోరారు. చిన్నతనం నుంచే విద్యార్థులు సేవా భావం కలిగి ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు అలా దాసునాయన, స్కూల్ డైరెక్టర్ ప్రభాకర్, ప్రిన్సిపాల్ బాష పాల్గొన్నారు.

సంక్షేమ సంఘంలో సభ్యత్వం పొందాలి



మాట్లాడుతున్న మిక్కిలి సురేష్‌బాబు

యడ్లపాడు: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నవరత్న పథకాలతో అనేక సంక్షేమాలను ప్రజల ఇంటి ముంగిటనే అందిస్తుందని ఇండియా లేబర్‌లైన్ ప్రతినిధి మిక్కిలి సురేష్ బాబు పేర్కొన్నారు. యడ్లపాడు మండలం పరిధిలోని జిందాల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పవర్‌ప్లాంట్ సమీపాన ఉన్న అంబేద్కర్ కాలనీ వాసులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్, వర్కింగ్ పీపుల్స్ కోయాలిషన్, ఇండియా లేబర్ లైన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక చర్చిలో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో పథకాలతో పాటు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని వివరించారు. అసంఘటిత కార్మికులు, వలస కార్మికులు ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం సభ్యులుగా చేరి లేబర్‌కార్డును పొందాలన్నారు. భవన నిర్మాణ సంక్షేమ సభ్యులుగా నమోదైన పలు రకాల ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఇండియా లేబర్‌లైన్ విజయవాడకు చెందిన మొబలైజర్ ఈశ్వరరావు, గుంటూరు పట్టణ కోఆర్డినేటర్ రవి, స్టీవెన్ పాల్గొన్నారు.